ఈనాడు తమిళనాడు

కొన్నేళ్లుగా చూస్తే ఆరోగ్యంపై ప్రజల ఖర్చు భారంగా మారుతోంది. కేంద్ర ఆరోగ్యశాఖ తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ విషయం ప్రధానంగా కనిపిస్తోంది. 'నేషనల్ హెల్త్ ఎకౌంట్స్ ఎస్టిమేట్స్ ఫర్ ఇండియా' పేరుతో 2021-22కు ప్రత్యేక నివేదిక ఇచ్చారు. దాన్ని విశ్లేషిస్తే పలు విషయాలు వెలుగుచూస్తున్నాయి.



రోగం ఖర్చు ముదురుతోంది!

◆ 5వ స్థానంలో రాష్ట్రం ◆ కేంద్ర నివేదికలో వెల్లడి

ఈనాడు-చెన్నై

నివేదిక ప్రకారం రాష్ట్ర జనాభా 7.7కోట్లు. రాష్ట్ర బడ్జెట్ వ్యయం రూ.2,91,041కోట్లుగా ఉంది. స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి రూ.20,71,286 కోట్లుగా ప్రకటించారు. జనాభాపరంగా దేశంలో 7వ స్థానంలో ఉన్న తమిళనాడు.. ఆరోగ్యం కోసం పెట్టే ఖర్చులో మాత్రం 5వ స్థానంలో ఉంది. ఇతర రాష్ట్రాలతో పోల్చినప్పుడు ఎక్కువ ఖర్చును కేటాయిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇందులో ప్రభుత్వం వ్యయంతో పాటు ప్రజల పెడుతున్నదీ ఉంది. దేశంలో మొత్తం 21 రాష్ట్రాల్ని పరిగణనలోకి తీసుకుంటే.. ఆరోగ్యం కోసం పెట్టే ఖర్చులో ప్రజల మీద పడుతున్న భారం విషయంలో 9వ స్థానంలో తమిళనాడు నిలిచింది.



సగటు భారం రూ.6,595

నీతి అయోగ్ సేకరించిన గణాంకాల ప్రకారం రాష్ట్రంలో ఒక్క ఆరోగ్యం కోణంలో చేసిన ఖర్చు.. రూ.50,779కోట్లు. ఈ స్థాయిలో ఖర్చుచేసిన రాష్ట్రాలు దేశంలో తక్కువగా ఉన్నాయి. తమిళనాడు కన్నా ముందు ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, కర్ణాటక మాత్రమే ఉన్నాయి. అటు ప్రభుత్వం, ఇటు ప్రజలు కలిపి రాష్ట్రం పెట్టిన ఖర్చు.. స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి(జీఎస్‌డీపీ)లో వాటా 2.5శాతంగా ఉందని నివేదికలో వెల్లడించారు. ఒక్కో వ్యక్తిపై పెట్టిన ఖర్చు చూస్తే.. ఏకంగా రూ.6,595గా ఉంది.

9 శాతం బడ్జెట్..

రాష్ట్ర బడ్జెట్‌పరంగా చూస్తే ఆరోగ్యం కోసం పెట్టిన ఖర్చులో పలు రాష్ట్రాలు ముందున్నాయి. తమిళనాడు 13వ స్థానంలో నిలిచింది. ఈ ఖర్చులో ప్రభుత్వ కేటాయింపులతో పాటు ఆయా స్థానిక సంస్థలు, దాతలిచ్చిన విరాళాలు, వివిధ ప్రభుత్వ సంస్థలు కలిపి.. తమిళనాడు రూ.26,257కోట్లు వెచ్చించినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించింది. ఇందులో ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన, ముఖ్యమంత్రి సమగ్ర ఆరోగ్యబీమా పథకానికి రూ.1,893 కోట్ల కేటాయింపులున్నట్లు వివరించారు. రాష్ట్రంలో ప్రభుత్వపరంగా పెట్టిన ఖర్చుచూస్తే.. బడ్జెట్ కేటాయింపుల్లో 9శాతంగా ఉండగా, స్థూల రాష్ట్ర దేశీయ ఉత్పత్తి(జీఎస్‌డీపీ) 1.3శాతంగా ఉంది. ఒక్కో వ్యక్తిపై పెట్టిన ఖర్చు రూ.3,410గా ఉందని తెలిపారు.

వ్యయం ఇలా..

ఆర్థిక సంవత్సరం	ప్రజల ఖర్చు (రూ.కోట్లలో)	తలసరి భారం (రూ.లలో)
2015-16	21,500	2,829
2016-17	22,626	2,938
2017-18	13,627	1,817
2018-19	14,509	1,909
2019-20	15,455	2,034
2020-21	16,654	2,191

రాష్ట్రం భరిస్తోందిలా..

(రూ.కోట్లలో)

ఆర్థిక సంవత్సరం	ఆరోగ్యంపై ఖర్చు
2015-16	32,975
2016-17	36,451
2017-18	29,664
2018-19	32,767
2019-20	35,001
2020-21	45,111
2021-22	50,779

జనం వాటా 34.6 శాతం..

ప్రభుత్వపరంగా కాకుండా.. జబ్బులకు, ఆరోగ్య రక్షణకు ప్రజలు పెట్టిన ఖర్చు సైతం రాష్ట్రంలో బాగా ఎక్కువగా ఉన్నట్లు నివేదికను అనుసరించి తెలుస్తోంది. ఇది రూ.17,554కోట్లు కాగా రాష్ట్రంలో ఆరోగ్యంపై పెట్టిన మొత్తం ఖర్చులో 34.6 శాతం ప్రజల వాటా ఉన్నట్లుగా నివేదిక స్పష్టం చేసింది. ఈ పరంగా చూస్తే ఒక్కొక్కరు సగటున రూ.2,280 ఖర్చు చేసినట్లు వెల్లడించారు. 2017-18కి ప్రజలపరంగా ఆరోగ్య ఖర్చు మునుపటికన్నా తగ్గినా ఆ తర్వాత క్రమంగా పెరుగుతూ వస్తుండటం ఆందోళనకు గురిచేస్తోంది.

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు

ప్రత్యేక బస్సులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తిరుమల వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు ఘనంగా జరగనున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు తమిళనాడు ప్రభుత్వ ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ తరఫున ప్రత్యేక బస్సులు నడపనున్నారు. మామూలు రోజుల్లో తిరుమలకు ప్రతిరోజు 35 బస్సులు నడుపుతుండగా బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 30 నుంచి అక్టోబర్ 13వ తేదీ వరకు ప్రతిరోజు 150 బస్సులు అదనంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి నడిపేందుకు నిర్ణయించారు. దీని గురించి రవాణా సంస్థ డైరెక్టర్ మోహన్ విడుదల చేసిన ప్రకటనలో... ఎస్‌టీసీ తరపున చెన్నై, తిరుచ్చి, తంజావూర్, కుంభకోణం, తూత్తుకుడి, పుదుచ్చేరి నుంచి తిరుమలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని, ముందుగా బుక్ చేసుకోవాలని సూచించారు.

టీవీకే మహానాడుకు అనుమతి

17 నిబంధనలు విధించిన పోలీసులు



ఎంపిక చేసిన స్థలం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విక్రవాండిలో తమిళగ వెట్రి కళగం మొదటి మహానాడు నిర్వహణకు విళుపురం జిల్లా ఎస్పీ కార్యాలయం బుధవారం రాత్రి అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విక్రవాండి సమీప వి.సాలై గ్రామంలో ప్రైవేట్ భూములను అద్దెకు తీసుకుని అక్టోబర్ 27న నిర్వహించనున్నారు. నిర్వహణకు అనుమతివ్వడానికి పోలీసులు 32 ప్రశ్నలు సంధించగా ఈనెల 21న పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ అందుకు సమాధానాలు పేర్కొంటూ పత్రాలను విళుపురం ఏడీఎస్పీ తిరుమల్‌కు అందజేశారు. వాటిని పరిశీలించిన ఎస్పీ కార్యాలయం 17 నిబంధనలతో మహానాడుకు అనుమతించింది.

ఎట్టకేలకు బెయిల్

మాజీ మంత్రి సెంథిల్‌బాలాజీ



చెన్నై, ప్యారీస్, న్యూస్‌టుడే: మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ 471 రోజుల తర్వాత గురువారం జైలు నుంచి బయటకు వచ్చారు. అన్నాడీఎంకే హయాంలో ప్రభుత్వ రవాణాసంస్థలో ఉద్యోగాలు పేరిట అక్రమాలకు పాల్పడినట్లు 2015లో దేవసహాయం అనే బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 2016లో నాటి రవాణా శాఖ మంత్రి సెంథిల్ బాలాజీ సహా 40 మందిపై ఈడీ కేసు నమోదు చేసింది. 2021 శాసనసభ ఎన్నికలకు ముందు డీఎంకేలో చేరిన ఆయన కరూర్ నియోజకవర్గం నుంచి విజయం సాధించి విద్యుత్తు శాఖ మంత్రి అయ్యారు. తనపై కేసు కొట్టివేయాలంటూ 2022లో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. 2023 జూన్ 13న సెంథిల్ బాలాజీ ఇంట్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించి ఆ మరుసటి రోజు ఆయన్ను అరెస్టు చేశారు.

మంత్రిగా తొలగింపు.. రాజీనామా

సెంథిల్ బాలాజీ అరెస్టు, ఈడీ దర్యాప్తు పరిణామాలతో ఆయన్ను మంత్రివర్గం నుంచి తొలగిస్తున్నట్లు గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అధికారం ఆయనకు లేదంటూ ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటన విడుదల చేశారు. సెంథిల్ బాలాజీ శాఖలను ఇతర మంత్రులకు కేటాయించారు. ఆయన ఏ శాఖా లేని మంత్రిగా కొనసాగుతారని ప్రకటించారు. ఈ పరిణామాలతో తన ఉత్తర్వులను గవర్నర్ నిలిపివేశారు. 2024 ఫిబ్రవరిలో సెంథిల్ బాలాజీ రాజీనామా లేఖను రాజ్‌భవన్‌కు సీఎం కార్యాలయం పంపగా దానిని గవర్నర్ ఆమోదించారు.

సంతకం చేయాలని..

సుప్రీంకోర్టు తీర్పు అనంతరం సెంథిల్ బాలాజీ తరఫు లాయరు ఎన్.ఆర్ ఇళంగో విలేకరులతో మాట్లాడుతూ... సోమ, శుక్రవారాల్లో ఈడీ కార్యాలయంలో సెంథిల్‌బాలాజీ హాజరై సంతకం చేయాలని, సాక్ష్యాలను నాశనం చేయరాదని, సాక్షులను కలిసే ఎలాంటి ప్రయత్నాలు చేయకూడదని, రూ. 25 లక్షలకు ఇద్దరు వ్యక్తుల పూచీకత్తు ఇవ్వాలని, విచారణ కోర్టులో ఈ కేసు కొనసాగడానికి సహకరించాలని, విదేశాలకు వెళ్లకూడదని పలు షరతులను సుప్రీంకోర్టు విధించినట్లు తెలిపారు. సెంథిల్ బాలాజీ మంత్రిగా బాధ్యతలు స్వీకరించేందుకు నిషేధం విధించారా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి అయ్యేందుకు ఎలాంటి నిషేధం విధించలేదని జవాబిచ్చారు.

ఎమర్జెన్సీ కాలంలోనూ ఇలా లేదు: స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: ఎమర్జన్సీ కాలంలోనూ ఇన్ని రోజుల జైలుజీవితం లేదంటూ మాజీ మంత్రి సెంథిల్ బాలాజీకి బెయిల్ లభించిన సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యాఖ్యానించారు. ఆయన తన సామాజిక మాధ్యమాల్లో... సెంథిల్ బాలాజీకి 471 రోజుల తర్వాత సుప్రీంకోర్టు ద్వారా బెయిల్ లభించిందన్నారు. రాజకీయ ప్రత్యర్థులను అణచివేసే విభాగంగా ఈడీని మార్చిన ప్రస్తుత పరిస్థితుల్లో దానికి ఏకైక పరిష్కారంగా సుప్రీంకోర్టు ఉందని తెలిపారు. రాజకీయ కుట్రపూరిత చర్యలు 15నెలలు కొనసాగాయని విమర్శించారు. అరెస్టు చేసి జైలులోనే ఉంచితే సెంథిల్ బాలాజీ మనోస్థైర్యాన్ని దెబ్బతీయొచ్చని భావించారని తెలిపారు. జైలు నుంచి విడుదలవుతున్న ఆయన్ను స్వాగతిస్తున్నానని పేర్కొన్నారు. 'నీ త్యాగం మహత్తరం, స్థైర్యం దానికన్నా మహత్తరమైనది' అంటూ ముక్తాయింపు పలికారు.

మళ్లీ అమాత్య యోగం?

చెన్నై, న్యూస్‌టుడే: సెంథిల్ బాలాజీకి బెయిల్ లభించడంతో రాష్ట్ర మంత్రివర్గం మార్పు తథ్యమంటూ మళ్లీ ప్రచారం ఊపందుకుంది. స్టాలిన్ నేతృత్వంలోని మంత్రివర్గంలో ఇప్పటివరకు నాలుగుసార్లు మార్పులు జరిగాయి. సెంథిల్ బాలాజీ మళ్లీ మంత్రి అయ్యేందుకు సుప్రీంకోర్టు ఎలాంటి ఆంక్షలు విధించలేదని న్యాయవాది ఇళంగో వెల్లడించారు. ఈనేపథ్యంలో మంత్రివర్గంలో మార్పు వ్యవహారం మరోసారి ఊపందుకుంది. సెంథిల్ బాలాజీని మంత్రివర్గంలోకి తీసుకోవడం పాటు ఉదయనిధికి ఉప ముఖ్యమంత్రి పదవి అప్పగించనున్నారని, గతంలో ఉద్వాసనకు గురైన ఆవడి నాజర్‌కు మళ్లీ చోటు కల్పించనున్నారని ప్రచారం జరుగుతోంది. సేలం రాజేంద్రన్ సహా కొందరి పేర్లు మంత్రివర్గం జాబితాలో చోటుచేసుకోవచ్చనే అంచనాలూ మొదలయ్యాయి. అక్టోబరు 2న అమావాస్య తర్వాత బహుళపక్షంలో శుభ ముహూర్తాన కొత్త మంత్రివర్గం బాధ్యతలు చేపట్టనుందనే ప్రచారం కూడా జరుగుతోంది.

అప్పుడు నేరం.. ఇప్పుడు త్యాగమా?

తమిళిసై సౌందరరాజన్

సైదాపేట, న్యూస్‌టుడే: సెంథిల్ బాలాజీని దేశం కోసం త్యాగం చేసిన వ్యక్తిలా చిత్రీకరించేందుకు ముఖ్యమంత్రి స్టాలిన్ యత్నిస్తున్నారని రాష్ట్ర భాజపా మాజీ అధ్యక్షురాలు తమిళిసై సౌందరరాజన్ ఆరోపించారు. ఆమె విడుదల చేసిన ప్రకటనలో.. సెంథిల్ బాలాజీపై నేరారోపణలు చేసిందే డీఎంకేనేనని తెలిపారు. వారు వేసిన కేసుకు కొనసాగింపుగానే ఈడీ అధికారులు అరెస్టు చేశారని పేర్కొన్నారు. ఇప్పుడు కూడా విడుదల కాలేదని, చట్టప్రకారం బెయిల్ పొందారని తెలిపారు. నేరారోపణలు అలాగే ఉన్నాయన్నారు. ఇంతకాలం హైకోర్టు బెయిలు ఇవ్వలేదని అంటే ముఖ్యమంత్రి హైకోర్టును కూడా విమర్శిస్తున్నారా అని ప్రశ్నించారు. బెయిలుకు, విడుదలకు తేడా తెలియకుండా డీఎంకే వారు సంబరాలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సెంథిల్ బాలాజీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చేసిన నేరాలు, ప్రస్తుతం త్యాగంగా మారిందా అని ప్రశ్నించారు.

జైలుకెళ్లడానికి డీఎంకే కారణం కాదా?: సీమాన్

చెన్నై: మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ జైలుకెళ్లడానికి డీఎంకే కారణం కాదా అని నామ్ తమిళర్ కట్చి చీఫ్ కన్వీనర్ సీమాన్ ప్రశ్నించారు. నగరంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... లడ్డూ, జిలేబీ, పంచామృతం వరుసలో ప్రస్తుతం బెయిల్ లభించడం కూడా సంచలనంగా మారిందన్నారు. దొంగతనం చేయడం, కమీషన్, లంచాలు తీసుకోవడం, టాస్మాక్ సరకును అదనపు ధరకు అమ్మడం, కల్తీ మద్యం విక్రయించడం అంతా త్యాగంగా మారిందని, అందుకే సెంథిల్ బాలాజీ విడుదల సందర్భంగా ముఖ్యమంత్రి విడుదల చేసిన ప్రకటనలో త్యాగమని పేర్కొన్నారని విమర్శించారు. సెంథిల్ బాలాజీ బెయిల్‌పై రావడం త్యాగమంటే, స్వాతంత్ర్యం కోసం మన పూర్వీకులు చేసినదానిని ఏమనాలని ప్రశ్నించారు. సెంథిల్ బాలాజీ జైలుకు వెళ్లడానికి అన్నాడీఎంకే హయాంలో డీఎంకే వేసిన కేసు కారణం కాదా అని ప్రశ్నించారు. ప్రత్యర్థి పార్టీలో ఉన్నప్పుడు అవినీతి ఆరోపణలు చేసి ఇప్పుడు డీఎంకేలో ఉండటంతో త్యాగంగా అభివర్ణిస్తున్నారని ఆరోపించారు.

జైలు నుంచి బయటకొచ్చిన మాజీ మంత్రి

ప్యారీస్, న్యూస్‌టుడే: సెంథిల్ బాలాజీకి సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో ప్రస్తుతం ఆయన జ్యుడిషియల్ కస్టడీ పొడిగింపు నిలిపేశారు. షరతులతో కూడిన బెయిల్‌పై ఉత్తర్వు నకలు ఇంకా అందలేదని, వచ్చాక నిర్ణయం తీసుకుంటారని చెన్నై ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కార్తికేయన్ తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పులో గందరగోళం ఉందని, బెయిల్ పూచీకత్తు కోర్టులో దాఖలు చేయొద్దని, దర్యాప్తు అధికారికి దాఖలు చేయాలన్నారు. బెయిల్ పూచీకత్తు కోర్టులో దాఖలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పులో చెప్పలేదని న్యాయమూర్తి తెలిపారు. ఈ సమయంలో దర్యాప్తు అధికారి వద్ద ఎలా దాఖలు చేయడం కుదురుతుందని సెంథిల్‌బాలాజీ తరపున తెలిపారు. దీంతో సెంథిల్ బాలాజీ బయటకు రావడంలో సమస్య ఏర్పడింది. బెయిల్ పూచీకత్తు ఆమోదించడంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఈడీ తెలపడంతో సెంథిల్ బాలాజీని జైలు నుంచి విడుదల చేయాలని సెషన్స్ కోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. పుళల్ జైలు నుంచి బయటకొచ్చిన సెంథిల్‌బాలాజీకి పార్టీనేతలు మేళతాళాలతో స్వాగతం పలికారు. డీఎంకే శ్రేణులు పెద్దసంఖ్యలో గుమిగూడటంతో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం ఏర్పడింది.

మహోన్నత వ్యక్తికి గొప్ప గుర్తింపు

చెన్నైలో ఓ వీధికి ఎస్పీబీ పేరుపై అభిమానుల స్పందన



టీనగర్, న్యూస్‌టుడే: గాన గంధర్వుడు ఎస్పీబీ నివాసమున్న చెన్నై నుంగంబాక్కంలోని కాందార్‌నగర్ మొదటి వీధికి ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేరు పెట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో పలువురు అభిమానులు ముఖ్యమంత్రి స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

❖ ఆ వీధికి బాలసుబ్రహ్మణ్యం పేరు పెట్టడం ఆనందంగా ఉంది. కోట్లాది మంది అభిమానం సంపాదించుకున్న ఆయన పేరు చిరకాలం నిలిచిపోవడానికి ఇది దోహదపడుతుంది.

– రాము మహరాజపురం, ఇండియన్ సింగర్స్ అండ్ మ్యూజిషియన్స్ రైట్స్ అసోసియేషన్, దక్షిణ భారత విభాగం

❖ గొప్ప విషయం. ఇది ఎప్పుడో జరిగి ఉండాలి. తమిళనాట తెలుగువారిని కూడా గౌరవించడం ఆనందంగా ఉంది. సంగీత ప్రపంచానికి చిరకాల సేవలందించిన మహోన్నత వ్యక్తికి దక్కిన గొప్ప గుర్తింపుగా భావిస్తున్నాను.

– బేతిరెడ్డి శ్రీనివాస్, శ్రీకళాసుధ తెలుగు అసోసియేషన్

❖ చాలా సంతోషంగా ఉంది. ఆయన 40 ఏళ్లకు పైగా చెన్నైలో ఉంటూ సేవలందించారు. చరణ్ నుంచి వినతి అందిన గంటల వ్యవధిలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం చూస్తే ఎస్పీబీకి ఎంత గౌరవం ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆయన చరిత్రలో నిలిచిపోతారు.

– గోపికా పూర్ణిమ, సినీ నేపథ్య గాయని

❖ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నాకున్న నలుగురు ఆత్మీయ స్నేహితుల్లో ఒకరు. ఆయన కుటుంబంతో చిరకాల బంధం ఉంది. 50 ఏళ్లకుపైగా సోదరుల్లా కలిసిమెలిసి ఉన్నాం. తన అద్భుతమైన కంఠంతో సంగీత ప్రపంచాన్ని కట్టిపడేసిన మాయదారి. పద్మభూషణ్‌తో పాటు అనేక పురస్కారాలు అందుకున్న ఆయన పేరును వీధికి నామకరణం చేయడం ఆయన ఆత్మీయులకు ఓదార్పుగా ఉంటుంది.

– సీఎంకే రెడ్డి, అఖిల భారత తెలుగు సమాఖ్య

మహా కళాకారుడికి మర్యాద: కమల్

చెన్నై, న్యూస్‌టుడే: నగరంలో సినీ నేపథ్యగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నివాసం ఉన్న వీధికి ఆయన పేరు పెట్టనున్నట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి స్టాలిన్‌కు ఎంఎన్ఎం అధ్యక్షుడు, నటుడు కమలహాసన్ కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. ఆయన తన 'ఎక్స్' పేజీలో.. వీధికి పేరు పెట్టడం ద్వారా లక్షలాది మంది కళాభిమానుల మదిలో నివసించే ఆ మహా కళాకారుడికి చేసే మర్యాద అన్నారు. ఎస్పీబీ అభిమానుల్లో ఒకడిగా తన అభినందనలు, కృతజ్ఞతలను ముఖ్యమంత్రికి తెలియజేశారు.

కామాక్షమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు 2 నుంచి



అలంకరణలో లక్ష్మి, సరస్వతి సమేత కామాక్షి అమ్మవారు

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురంలోని ప్రసిద్ధ కామాక్షి అమ్మవారి ఆలయంలో పెరటాసి మాస నవరాత్రి ఉత్సవాలు అక్టోబర్ 2వ తేదీ ఉదయం పూర్వాంగ చండీ హోమంతో ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల సమయంలో ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక అభిషేక ఆరాధనలు నిర్వహిస్తారు. రాత్రిళ్లు అలంకరించి నవరాత్రి మండపంలో కొలువుదీర్చి శూర సంహార కార్యక్రమాలను జరుపనున్నారు. ఏర్పాట్లను ఆలయ వంశపారంపర్య ధర్మకర్త తరపున శ్రీకార్యం సుందరేశ అయ్యర్, మణియగార్ సూర్య నారాయణన్ తదితరులు సమీక్షిస్తున్నారు.

నెయ్యిలో కల్తీపై హిందూ సంఘాల ఖండన

వడపళని, న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ తయారీలో జంతు కొవ్వు కలిసిన నెయ్యి వినియోగంపై నగరంలోని పలు హిందూ సంస్థలు వ్యతిరేకత తెలియజేశాయి. చెన్నై 'చిన్మయా హెరిటేజ్ సెంటర్'లో బుధవారం జరిగిన నిరసన కార్యక్రమంలో చిన్మయా మిషన్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్, విశ్వ హిందూ పరిషత్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, మాతా అమృతానందమయి మఠ్, హిందూ మున్నని, శబరిమల అయ్యప్ప సేవా సమాజ్ తదితర సంస్థలకు చెందిన సభ్యులు పాల్గొన్నారు. కల్తీ నెయ్యితో చేసిన లడ్డూను స్వామివారికి నైవేద్యంగా సమర్పించడాన్ని ఖండించారు. భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీశారని విమర్శించారు. తప్పిదానికి ప్రాయశ్చిత్తం చేయాలనుకుంటున్నట్లు సంస్థలు పేర్కొన్నాయి. కారకులపై న్యాయపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. చెన్నైలో నవరాత్రి సమయంలో ప్రత్యేక ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తమిళ పురటాసి మాసం చివరివారంలో చెన్నై నుంచి తిరుపతికి ప్రాయశ్చిత్తంగా పాదయాత్ర కూడా చేపట్టనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

రాబోయే ఎన్నికల్లో అన్నాడీఎంకే వ్యూహమే గెలుస్తుంది

మాజీమంత్రి విజయభాస్కర్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రానున్న 2026 శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే రచించే వ్యూహమే గెలుస్తుందని అన్నాడీఎంకే మాజీమంత్రి విజయభాస్కర్ తెలిపారు. పుదుకోట్టై జిల్లా విరాలిమలైలో అన్నాడీఎంకే తరపున అన్నా జయంతి బహిరంగసమావేశం గురువారం జరిగింది. ఇందులో పాల్గొన్న విజయభాస్కర్ మాట్లాడుతూ.... అన్నాడీఎంకే పాలనలో అమలుచేసిన ల్యాప్‌టాప్ పంపిణీ, తాళికి బంగారం, రాయితీలో స్కూటర్ వంటి పలు పథకాలను నిలిపివేసిందన్నారు. విద్యుత్‌ఛార్జీలు, ఇంటి పన్ను పెంచేసి మహిళలకు రూ.వెయ్యి అందిస్తున్నారని చెప్పారు. పుదుకోట్టైలో ఇద్దరు మంత్రులు ఉన్నా ఎలాంటి అభివృద్ధి లేదన్నారు. ఈ పాలనలో ప్రజలు పోరాటం చేయని రోజే లేదన్నారు. ప్రభుత్వంపై ప్రజలు విరక్తితో ఉన్నారన్నారు.

స్టాలిన్‌ను మళ్లీ సీఎం చేయాలి

మంత్రి ఉదయనిధిస్టాలిన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: స్టాలిన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయాలని మంత్రి ఉదయనిధిస్టాలిన్ తెలిపారు. తంజావూర్ జిల్లా కుంభకోణం వలైయంపేట్టై ప్రాంతంలో కరుణానిధి నిలువెత్తు విగ్రహాన్ని మంత్రి గురువారం ఆవిష్కరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. 234 శాసనసభ నియోజకవర్గాల్లో కరుణానిధి నిలువెత్తు విగ్రహాన్ని ఆవిష్కరించాలని ముఖ్యమంత్రి స్టాలిన్ ఆదేశించారని చెప్పారు. కరుణానిధి అన్ని శాసనసభ ఎన్నికల్లో విజయకేతనం ఎగురవేశారని గుర్తు చేశారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో 40 నియోజకవర్గాలలో 100శాతం డీఎంకే కూటమి విజయం పొందిందన్నారు. మైలాడుదురైలో 3 లక్షల ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ లోక్‌సభ సభ్యుడు విజయం సాధించారని చెప్పారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో పార్టీ సభ్యులు ఉత్తమంగా శ్రమించి స్టాలిన్‌ను మరోసారి సీఎం స్థానంలో కూర్చోబెట్టాలని కోరారు. మంత్రి అన్బిల్ మహేష్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మంత్రులు ఉదయనిధి, అన్బిల్ మహేష్

దిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రి

చెన్నై, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం సాయంత్రం దిల్లీ వెళ్లారు. చెన్నై మెట్రోరైలు ప్రాజెక్టు రెండో దశ పనులకు, నూతన విద్యావిధానం ప్రాతిపదికన అందించాల్సిన నిధులు కోసం ప్రధానిని కలిసేందుకు ఆయన సమయం కోరారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు పీఎం కార్యాలయం అపాయింట్‌మెంట్ కేటాయించింది. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం చెన్నై విమానాశ్రయం నుంచి ముఖ్యమంత్రి దిల్లీ వెళ్లారు. తమిళనాడు హౌస్‌లో బస చేసి శుక్రవారం ఉదయం ప్రధానిని కలవనున్నారు. తన అభ్యర్థనలకు సంబంధించి మెమొరాండాన్ని అందించనున్నారు. సాయంత్రానికి చెన్నై తిరిగి రానున్నారు.

చెన్నైలో భారీవర్షం



అన్నాసాలైలో వర్షంలో వెళుతున్న వాహనాలు

ప్యారీస్, వడపళని, న్యూస్‌టుడే: చెన్నైలో కురిసిన భారీ వర్షానికి విమానాశ్రయంలో సేవలకు అంతరాయం ఏర్పడింది. సబ్‌వేలు నీట మునిగాయి. రోడ్లపై వాననీరు నిలవడంతో వాహన చోదకులు ఇబ్బందిపడ్డారు. చెన్నై, శివారు ప్రాంతాల్లో రెండురోజులుగా రాత్రి సమయాల్లో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో సాయంత్రం నల్లటి మబ్బులు వ్యాపించి తాంబరం, పెరుంగళత్తూర్, వండలూరు, క్రోంపేట, పల్లావరం, సేలైయూర్ తదితర ప్రాంతాల్లో గంటపాటు వర్షం కురిసింది. జీఎస్టీ రోడ్డులో లోతట్టు ప్రాంతాల్లో వాననీరు చేరింది. అంబత్తూర్ తదితరచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. చెన్నైలో గురువారం ఉదయం కూడా వర్షం కురిసింది. అత్యధికంగా ఆవడి, అంబత్తూరు, వానగరంలో 13 సెం.మీ. నమోదైంది. తిరువాలంగాడు 11 సెం.మీ., మణలి 10 సెం.మీ., కేకేనగర్, అన్నానగర్, కత్తిపారై 9 సెం.మీ., కొళత్తూర్, కోడంబాక్కం, పుళల్ 8 సెం.మీ., రెడ్‌హిల్స్ 7.5. సెం.మీ, రాయపురం, తిరువొత్తియూర్, మాధవరం, ఆలందూర్ 7 సెం.మీ, మదురవాయల్, షోళింగనల్లూర్ 6 సెం.మీ. వర్షం కురిసింది. ఆవడి సేక్కాడు ప్రాంతంలో కొత్తగా నిర్మించిన రైల్వే సొరంగం వాననీటితో నిండిపోయింది. కార్పొరేషన్ సిబ్బంది విద్యుత్తు మోటార్ల సాయంతో తొలగించే పనులు చేపట్టారు. కొరట్టూర్ ఈఎస్ఐ ఆస్పత్రిలోకి వాననీరు చేరింది.



విమానసేవలకు అంతరాయం..

బుధవారం రాత్రి కురిసిన వర్షానికి బెంగళూరు, ముంబాయి, విజయవాడ, భువనేశ్వర్, కోళిక్కోడు, తిరుచ్చి, తిరువనంతపురం, కౌలాలంపూర్ నుంచి వచ్చిన విమానాలు ల్యాండ్ కాలేక చాలా సమయం ఆకాశంలోనే చక్కర్లు కొట్టారు. మధ్యలో వర్షం కొంత తగ్గిన వెంటనే అత్యవసరంగా ల్యాండ్ అయ్యాయి. తిరుచ్చి నుంచి 68 మంది ప్రయాణికులతో చెన్నైకి రాత్రి 10.05 గంటలకు వచ్చిన ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానం ఇంధనం కొరత కారణంగా బెంగళూరు వెళ్లింది. చెన్నై నుంచి వెళ్లాల్సిన ముంబయి, దిల్లీ హైదరాబాద్, కొచ్చి, కోయంబత్తూరు తదితర 20 విమానాలు రెండు గంటలు ఆలస్యంగా వెళ్లాయి. బుధవారం రాత్రి కొలంబో నుంచి చెన్నై రావాల్సిన శ్రీలంక ఎయిర్‌లైన్స్, చెన్నై నుంచి శ్రీలంకకు వెళ్లాల్సిన విమానాలు రద్దయ్యాయి.



రోడ్డుపై విరిగిపడిన చెట్టు



కొరట్టూరులోని ఓ పార్కులో నిలిచిన నీరు



ఏఏఐ అధికారులతో చర్చిస్తున్న మంత్రి టీఆర్బీ రాజా

విమానాశ్రయ విస్తరణపై సమాలోచనలు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై నగర విమానాశ్రయాన్ని పెద్ద విమానాల రాకపోకలకు వీలుగా (కోడ్ ఎఫ్ ఎయిర్‌క్రాఫ్ట్) స్థాయిని పెంచనున్నట్లు రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీఆర్బీ రాజా పేర్కొన్నారు. తమిళనాడు పారిశ్రామికాభివృద్ధి సంస్థ (టిడ్కో) ఛైర్మన్ సందీప్ నందూరి, భారత విమానాశ్రయాల ప్రాధికార సంస్థ (ఏఏఐ) అధికారులతో మంత్రి బుధవారం సమావేశమయ్యారు. విమానాశ్రయ విస్తరణ గురించి వారితో చర్చించారు. పెద్ద విమానాల రాకపోకలకు ఉండే అంతర్జాతీయంగా వాణిజ్య అభివృద్ధితో పాటు ప్రయాణికుల సంఖ్య పెరుగుతుందన్నారు. ఇదిలా ఉండగా రెండో రన్‌వే అడ్డంకులను తొలగించాలని ఏఏఐ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది.

పాలనా కారణాలతోనే దఫేదార్ బదిలీ: జీసీసీ



మేయర్‌తో దఫేదార్ మాధవి (పాతచిత్రం)

చెన్నై, న్యూస్‌టుడే: మేయర్ కార్యాలయం దఫేదార్‌ను పాలనా కారణాలతోనే బదిలీ చేసినట్లు మహానగర చెన్నై కార్పొరేషన్ యంత్రాంగం వెల్లడించింది. ఈ మేరకు విడుదల చేసిన ప్రకటనలో.. దఫేదార్ మాధవి తరచూ కార్యాలయ విధానాలు అతిక్రమించి, సక్రమంగా సమాచారం అందించకుండా ఆలస్యంగా రావడం, విధులు సక్రమంగా నిర్వర్తించకపోవడం తదితర ఫిర్యాదుల ఆధారంగా గత నెల ఆమెను వివరణ కోరినట్లు తెలిపింది. ఇంతకు మించి ఆమె వ్యక్తిగత మేకప్ గురించి ఎలాంటి వివరణ కోరలేదని, విచారించలేదని పేర్కొంది. ఆమె వ్యక్తిగత మేకప్ కారణంగానే బదిలీ చేసినట్లు కొన్ని ప్రసార మాధ్యమాల్లో వచ్చిన వార్తలు అవాస్తవమని పేర్కొంది. ప్రస్తుతం మాధవి బదిలీపై వెళ్లి మణలి జోనల్ కార్యాలయంలో పనిచేస్తున్నారని పేర్కొంది. మేయర్ ప్రియకు దీటుగా లిప్‌స్టిక్, మేకప్ వేసుకోవడంతో బదిలీ చేసినట్లు వస్తున్న వార్తాకథనాలను ప్రచురించవద్దని కోరింది.

రాష్ట్ర జాలర్లకు భద్రత కల్పించాలి: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: తమిళనాడు జాలర్ల భద్రత నావికా దళంతో భద్రత కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ ముఖ్యమంత్రి పన్నీర్‌సెల్వం డిమాండ్ చేశారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్ర జాలర్లపై శ్రీలంక నావికాదళం దౌర్జన్యాలు మితిమీరాయన్నారు. మంగళవారం 300 పడవల్లో వేటకు వెళ్లిన రామేశ్వరం జాలర్లను శ్రీలంక నావికాదళం తరిమికొట్టినట్లు తెలిసిందన్నారు. లంక నేవీ దాడితో ఒక్కో పడవకు రూ.70 వేల నష్టం వాటిల్లినట్లు తెలిపారన్నారు. శ్రీలంకకు కొత్త అధ్యక్షుడు వచ్చిన వెంటనే జాలారి దాడి జరగడం దిగ్భ్రాంతికి గురిచేసినట్లు చెప్పారు. మత్స్యకారుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, వారికి భారత నావికాదళంతో భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

విమానాశ్రయ నిర్మాణ అనుమతికి కేంద్రానికి దరఖాస్తు

సైదాపేట, న్యూస్‌టుడే: పరందూరు విమానాశ్రయ ప్రాజెక్టుకు విధానపరమైన అనుమతి పొందేందుకు కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం విన్నవించింది. చెన్నై శివారులో కాంచీపురం జిల్లా పరందూరు వద్ద 5,476 ఎకరాల విస్తీర్ణంలో విమానాశ్రయాన్ని నిర్మించనున్న విషయం తెలిసిందే. భూ సేకరణకు తమిళనాడు పరిశ్రమలశాఖ అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి విధానపరమైన అనుమతి కోసం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి సంస్థ (టిడ్కో) దరఖాస్తు చేసుకుంది.

స్థానిక సంస్థల విద్యుత్తు బకాయిలు రూ.5,069 కోట్లు

● టాన్‌జెడ్కోకు రూ.1.5 లక్షల కోట్ల అప్పులు ● కఠినంగా వసూలు చేయాలంటున్న నిపుణులు

- న్యూస్‌టుడే, వడపళని

రాష్ట్రంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న పలు సంస్థలు 'టాన్‌జెడ్కో'కు రూ.5,069 కోట్ల మేరకు విద్యుత్తు బకాయిలు చెల్లించాల్సి ఉంది. చెన్నై నగరంలోని సంస్థలు, పరిసరాల్లోని జిల్లాల్లో ఉన్న కార్యాలయాలు ఆగస్టు 31వ తేదీ నాటికి రూ.936 కోట్ల వరకు బకాయిలున్నట్లు రికార్డులు తెలుపుతున్నాయి. 2ఏ కేటగిరీ కింద కనీసం లోటెన్షన్ (ఎల్టీ)తో కూడిన 6.55 లక్షల కనెక్షన్లు వీధి దీపాలు, నీటి సరఫరాకు వినియోగిస్తున్నారు. వీటి నుంచి టాన్‌జెడ్కోకు రూ.5,069 కోట్ల వరకు బిల్లులు రావాల్సి ఉంది. డొమెస్టిక్ (1ఏ), కమర్షియల్ (వి) హై టెన్షన్ కనెక్షన్ల కింద ఎంతెంత రావాల్సి ఉందో టాన్‌జెడ్కో వివరించలేదు. 2023 మార్చి వరకు టాన్‌జెడ్కో 14వ వార్షిక నివేదిక మేరకు 90,292 కనెక్షన్ల నుంచి రూ.1,400 కోట్లు బకాయిలు ఉన్నట్లు చూపిస్తోంది. 2ఏ కేటగిరీతో పోలిస్తే చెల్లించాల్సిన మొత్తం తక్కువేనని అధికారులు అంటున్నారు.

☛ టీడబ్ల్యూఏడీ అధికం

అత్యధికంగా తమిళనాడు నీటిసరఫరా, మురునీటి మండలి (టీడబ్ల్యూఏడీ) బకాయిలతో కలిపి రూ.2,500 కోట్లు చెల్లించాలి. 2022 నుంచి టారిఫ్‌లో మార్పులు జరగడంతో బకాయిలు ఇంకా ఎక్కువే ఉండొచ్చు. వీధి దీపాలు, నీటి సరఫరాకు బాగా విద్యుత్తు వినియోగమవుతోందని టాన్‌జెడ్కో సీనియర్ అధికారి ఒకరు అంటున్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి టాన్‌జెడ్కోకు రూ.10,868 కోట్ల మేరకు నష్టం వాటిల్లినట్లు ఆయన తెలుపుతున్నారు. టాన్‌జెడ్కో కనీసం 60శాతం వరకైనా ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర సంస్థల నుంచి వసూలు చేస్తే బాగుండేదని పేర్కొన్నారు. అదేవిధంగా విద్యుత్తు చౌర్యం అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. బిల్లులు సకాలంలో చెల్లించకుంటే 6 శాతం అధిక ఛార్జీలతో బకాయిలు వసూలు చేయాలని, తద్వారా సంస్థకు రూ.306 కోట్ల మేరకు ఆదాయం సమకూరుతుందని చెబుతున్నారు.



టాన్‌జెడ్కో కార్యాలయం

☛ వాయిదాల పద్ధతిలో చెల్లింపు

పలు స్థానిక సంస్థలతో పాటు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) 2022 వరకు బకాయిలతో కలిపి వాయిదాల పద్ధతిలో చెల్లిస్తున్నాయని, బకాయిలు వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అధికారులంటున్నారు. ప్రభుత్వ సంస్థలపై టాన్‌జెడ్కో సౌమ్యంగా వ్యవహరిస్తోందని పలువురు వినియోగదారులు ఫిర్యాదులు చేస్తున్నారు. బకాయిలు వసూలు చేయడంలో టాన్‌జెడ్కో జాప్యంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులకు సమస్యలేర్పడతాయని 'ఎన్జీఓ ఫ్యాక్ట్ ఇండియా' ప్రధాన కార్యదర్శి సి.సెల్వరాజ్ పేర్కొన్నారు.

బకాయిలున్న సంస్థలు

- చెన్నై (నార్త్, తిరువళ్లూరు జిల్లా)... రూ.255 కోట్లు, కాంచీపురం (చెన్నై సౌత్, చెంగల్పట్టు) 681, ఈరోడ్ 950, తిరుచ్చి 857, వేలూరు 560, తిరునెల్వేలి 511, మదురై 483, విల్లుపురం 402, కోయంబత్తూరు 370 కోట్లు.
- టాన్‌జెడ్కోకు మార్చి 2023 వరకు రూ.1.5 లక్షల కోట్ల అప్పులుండగా ప్రస్తుతం రూ.18 వేల కోట్లు ఎక్కువయ్యాయి.



సీసీ కెమెరాలో నమోదైన దృశ్యం

నల్ల చిరుత సంచారం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లా కొత్తగిరి సమీప మిళితేన్ ప్రాంతంలో గత రెండు రోజులుగా నల్ల చిరుత సంచరిస్తున్న సీసీ కెమెరాల దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరలయ్యాయి. పెంపుడు శునకాన్ని వేటాడటానికి ఇంట్లో చొరబడి బయటికి రావడం, రోడ్డు పక్కన కూర్చొని కాపుకాసే దృశ్యాలు అందులో ఉన్నాయి. నల్ల చిరుత సంచారంతో ఆ ప్రాంతవాసులు భయాందోళన చెందుతున్నారు. త్వరగా పట్టుకోవడానికి అటవీ శాఖ సిబ్బంది చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు ఐఐటీఎంలో 'నిర్మాణ్ డెమో డే'

వడపళని, న్యూస్‌టుడే: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మద్రాస్ (ఐఐటీఎం)లో శుక్రవారం 'నిర్మాణ్ డెమో డే-2024' కార్యక్రమం జరగనుంది. గౌరవ అతిథులుగా వెంచర్ ఈస్ట్ సంస్థ జనరల్ పార్టనర్ డాక్టర్ శ్రీకాంత్ సుందరరాజన్, నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఏఐ అండ్ ఐవోటీ డైరెక్టర్ నవరతన్ కటారియా పాల్గొంటున్నారు. ఉదయం 9.45 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఐఐటీ ప్రాంగణంలోని సుధ, శంకర్ ఇన్నోవేషన్ హబ్ వేదిక కానుందని ఐఐటీ ఓ ప్రకటనలో పేర్కొంది.

రాసిమణల్ ఆనకట్ట నిర్మాణానికి ఆమోదం పొందాలి

పీఆర్ పాండియన్

ఆర్కేనగర, న్యూస్‌టుడే: తమిళనాడులోని అన్ని రైతు సంఘాల సమన్వయ కమిటీ అధ్యక్షుడు పీఆర్ పాండియన్ గురువారం మన్నార్‌కుడిలో విలేకరులతో మాట్లాడుతూ... భారతదేశంలో వాతావరణ మార్పులకు భారీగా నష్టపోయింది వ్యవసాయ రంగమేనన్నారు. ప్రధాని పంట బీమా పథకంలో మార్పులు చేసి విపత్తుల వలన నష్టపోయే రైతులకు మేలు జరిగేలా చేయాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వ బీమా సంస్థ ఛైర్మన్ రితీష్ చౌహాన్‌కు లేఖ రాశానని చెప్పారు. ముఖ్యమంత్రి స్టాలిన్ శుక్రవారం ప్రధానిని కలవనున్నారని, ఈ సందర్భంగా బీమా పరిహారం పూర్తిగా చెల్లించాలని, ప్రస్తుత పరిహారానికి సంబంధించి జీవోని రద్దు చేయాలని ప్రధాని మోదీని కోరాలన్నారు. అదేవిధంగా సముద్రంలో కలిసే మిగులు జలాలను అడ్డుకుని కావేరిపై రాసిమణల్ వద్ద ఆనకట్ట నిర్మించేందుకు ఆమోదం పొందాలని తెలిపారు.

'సెంథిల్ బాలాజీపై ఈడీ ప్రత్యేక దృష్టి సారించాలి'

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: బెయిల్ మంజూరు అయినా మాజీ మంత్రి సెంథిల్ బాలాజీపై ఈడీ ప్రత్యేక దృష్టి సారించాలని కోవై సౌత్ ఎమ్మెల్యే వానతీ శ్రీనివాసన్ అన్నారు. కోవై సాయిబాబా కాలనీలోని భారతియార్ పార్కులో ఆమె గురువారం మొక్కలు నాటిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. సెంథిల్ బాలాజీ విడుదలతో రాష్ట్ర మంత్రి వర్గంలో మార్పు జరిగే అవకాశం ఉందని, అయితే రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడే అవకాశం లేదని వ్యంగ్యంగా పేర్కొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న వానతి

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

వడపళని, న్యూస్‌టుడే: విద్యుత్తుశాఖ చేపడుతున్న మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ● గుమ్మిడిపూండి, పాపాన్‌కుప్పం, సిప్కాట్, అంబత్తూరు టీఐ సైకిల్, పమ్మల్, నంగనల్లూరు, రాయపేట, అడయార్, అయ్యప్పన్‌తాంగల్, కాట్టుపాక్కం, కారంబాక్కం, వానగరం, భరణిపుదూరు ప్రాంతాల్లోని పలు వీధులు, కాలనీ, అపార్టుమెంట్లలో సరఫరాకు అంతరాయం కలగనుంది.

పీఎఫ్ ఖాతాదారుల సమావేశం నేడు

వడపళని, న్యూస్‌టుడే: ఉద్యోగుల భవిష్య నిధి ఖాతాదారుల సమావేశం శుక్రవారం ప్రాంతీయ కార్యాలయాల్లో జరుగనుంది. చెన్నై, అంబత్తూరు, తాంబరం, కాంచీపురం, వేలూరు, పుదుచ్చేరిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5.45 గంటల వరకు సమావేశం జరుగుతుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా ప్రారంభమైన సంస్థలకు ఈపీఎఫ్, ఆన్‌లైన్ సేవల గురించి వివరిస్తారని, ఖాతాదారులు, పింఛను అందుకునే వారు సమస్యలను నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. పాల్గొనే వారు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడు చేసుకుని వివరాలు తెలియజేయాలన్నారు.

సెంజి కోటలో యునెస్కో బృందం పర్యటన నేడు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లాలోని పురాతన సెంజి కోటను యునెస్కో ప్రతినిధుల బృందం శుక్రవారం సందర్శించనుంది. ఈ క్రమంలో కోట పరిసరాలు, చుట్టూ ఉన్న రోడ్లను బాగు చేస్తున్నారు. కోట సమీపంలో ప్రైవేటు భూముల్లో ఉన్న ముళ్ల పొదలను తొలగించి కోట మార్గాలను గుర్తించే సమాచార సూచికలను ఏర్పాటు చేశారు. కోట విశేషాలపై జిల్లా యంత్రాంగం లఘుచిత్రం రూపొందించింది. దీనిని యునెస్కో బృందం ఎదుట ప్రదర్శిస్తారు. గురువారం మంత్రి సెంజి మస్తాన్ విలేకరులతో మాట్లాడుతూ.. భారత పురావస్తు శాఖ అదనపు డైరెక్టర్ జాన్ విచ్ మూడు రోజుల క్రితం కోటలో పరిశీలించారని, పర్యాటకులకు చెట్టికుళంలో బోట్ హౌస్ నిర్వహించాలని, కోటలో పచ్చదనం ఉండేలా భారీ ఉద్యానవనం ఏర్పాటు చేయాలని, ప్రకాశవంతమైన లైట్లను ఏర్పాటు చేయాలని, తాగునీరు, మరుగుదొడ్ల వసతి కల్పించాలని, 800 అడుగుల ఎత్తులోని కోటపైకి సైకిళ్లపై పర్యాటకులు వెళ్లలేని కారణంగా రాజా కోట, రాణి కోటకు రోప్‌కార్ వసతి ఏర్పాటు చేయాలని తదితర అంశాలపై ఆయనకు వినతిపత్రాలను సమర్పించామని తెలిపారు. ఇవే వినతులను యునెస్కో బృందానికి శుక్రవారం అందజేయనున్నామని తెలిపారు.



కోటలోని కందకం శుభ్రం చేస్తున్న దృశ్యం

పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలి: అన్బుమణి

సైదాపేట, న్యూస్‌టుడే: విదేశీ పర్యటనతో రాష్ట్రానికి తీసుకొచ్చిన పెట్టుబడులపై ముఖ్యమంత్రి స్టాలిన్ శ్వేతపత్రం విడుదల చేయాలని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... మూడేళ్ల డీఎంకే పాలనలో అవగాహన ఒప్పందాలు చేసుకున్న రూ.10 లక్షల కోట్ల పెట్టుబడుల్లో 60 శాతం వచ్చాయని, మిగిలినవి రానున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారన్నారు. పెట్టుబడుల గురించి రాష్ట్ర ప్రభుత్వం రోజుకో మాట చెబుతోందన్నారు. రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడుల గురించి తెలుసుకునే హక్కు ప్రజలకు ఉందన్నారు. కావున రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



అంజలి ఘటిస్తున్న స్టాలిన్ తదితరులు

ఎజ్రా సర్గుణానికి సీఎం నివాళి

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఎజ్రా సర్గుణం మృతదేహానికి ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం నివాళులర్పించారు. భారత సామాజిక న్యాయ సంస్థ వ్యవస్థాపకుడు, ఈసీఐ బిషప్ ఎజ్రా సర్గుణం 22న మృతి చెందారు. అమెరికా నుంచి ఆయన కుమార్తె వచ్చాక గురువారం ఉదయం చెన్నై వానగరంలోని జీసస్ కాల్స్ ప్రాంగణంలో అంజలి ఘటించడానికి మృతదేహాన్ని ఉంచారు. సీఎంతోపాటు పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు అంజలి ఘటించారు.

రాష్ట్రానికి 17,100 టన్నుల గోధుమలు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని రేషన్ దుకాణాల్లో కార్డుదారుల ఇష్టం ప్రకారం బియ్యానికి బదులు గోధుమలు ఉచితంగా అందజేస్తున్నారు. చెన్నై, జిల్లా కేంద్రాల్లో కార్డుకు గరిష్ఠంగా 10 కిలోలు, ఇతర ప్రాంతాల్లో 5 కిలోల గోధుమలు ఇస్తున్నారు. గోధుమలను ఎఫ్‌సీఐ కేటాయిస్తోంది. నెలకు 13,000 టన్నులు కేటాయిస్తుండగా గతేడాది తగ్గించింది. ఆ తర్వాత 8,500 టన్నులు కేటాయించింది. కేటాయింపులు పెంచాలని ముఖ్యమంత్రి స్టాలిన్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంబంధిత మంత్రి, అధికారులు దిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వ ఆహార శాఖ కార్యదర్శిని సంప్రదించి పరిస్థితిని వివరించారు. ఇటీవల చెన్నై వచ్చిన కేంద్ర ఆహారశాఖ కార్యదర్శి సంజీవ్ చోప్రాకు ఇదే విషయమై విన్నవించారు. ఈ నేపథ్యంలో 17,100 టన్నులకు పెంచి కేంద్రం ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చేనెల 24 నుంచి అందుతాయని అధికారులు తెలిపారు.

కుమార్తె వివాహానికి కూడబెట్టిన రూ.21 లక్షలు పోగొట్టుకున్న రైతు

కనిపెట్టి అప్పగించిన పోలీసులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: కుమార్తె వివాహానికి ఓ రైతు కూడబెట్టిన రూ.21 లక్షల నగదు పోగొట్టుకోగా పోలీసులు కనిపెట్టి అప్పగించిన సంఘటన తంజావూర్‌లో చోటుచేసుకుంది. తంజావూర్ జిల్లా తిరుక్కాట్టుపల్లికి చెందిన కామరాజ్ (60) భార్య కొన్నేళ్ల క్రితం చనిపోయింది. వీరికి ఓ కుమార్తె ఉంది. ఇదిలా ఉండగా కుమార్తెకు వివాహం చేయడానికి కామరాజ్ వ్యవసాయం చేస్తూ రూ.21 లక్షల వరకు కూడబెట్టాడు. ఆ నగదు ఇంట్లో ఉంటే సురక్షితం కాదని భావించి తంజావూర్‌లోనే ఉన్న తన సోదరుడు రాజా వద్ద దాచేందుకు నిర్ణయించాడు. ఆ మేరకు డబ్బు సంచిలో పెట్టుకుని ద్విచక్రవాహనంలో 19వ తేదీ సోదరుడి ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో ఎత్తుపల్లాలు ఉండటంతో నగదు సంచి బైక్ నుంచి జారి కిందపడిపోయింది. చాలాదూరం వెళ్లిన తర్వాత చూసుకున్న కామరాజ్ వెనక్కు తిరిగి వచ్చి వెతికినా దొరకలేదు. దీంతో దిగ్భ్రాంతికి గురై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలు పరిశీలించారు. నడుపడుగైకు చెందిన మేకల కాసే ఓ మహిళ నగదు సంచి తీసినట్లు గుర్తించారు. ఆ మహిళ ఆచూకీ కనుగొని ఆమె నుంచి నగదు సంచి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం కామరాజ్‌కు డీఎస్పీ అరుల్‌మొళి అప్పగించారు.



కామరాజ్‌కు నగదు అప్పగిస్తున్న పోలీసులు

27, 28 తేదీల్లో జాతీయ తొల్‌కుడి సదస్సు

సైదాపేట, న్యూస్‌టుడే: 'గిరిజన సంస్కృతి పరిరక్షణ, సుసంపన్నం' పేరుతో రెండు రోజుల జాతీయ సదస్సు 27, 28 తేదీల్లో జరగనుంది. తమిళనాడు గిరిజనుల భాషా వనరులు, ధ్వనులు భావితరాలు ఉపయోగించేలా ఎథ్నోగ్రఫీ పద్ధతిలో భద్రపరచనున్నట్లు తమిళనాడు ఆర్థిక నివేదికలో తెలిపారు. ఇందుకు రూ.2 కోట్లు కేటాయించారు. ఈ నేపథ్యంలో గిరిజన భాషా వనరులను డాక్యుమెంట్ చేయటానికి మార్గాలను అన్వేషించేందుకు ప్రఖ్యాత జాతీయ విద్యానిలయాలు, అధ్యయనశాలల్లో పని చేసే అధ్యయనకారులతో సదస్సు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. దీనికి ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమశాఖ మంత్రి కయల్విలి సెల్వరాజ్ నేతృత్వం వహించనున్నారు.

కుమరి ఆనంద్ లేకుంటే తమిళిసైకి గుర్తింపేది?

మంత్రి పొన్ముడి

ప్యారిస్, న్యూస్‌టుడే: కుమరి ఆనంద్ కుమార్తె అనే గుర్తింపు తప్ప తమిళిసైకి మరే ఇతర గుర్తింపు లేదని మంత్రి పొన్ముడి విమర్శించారు. తేనిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... ఉదయనిధి స్టాలిన్‌కి ఉపముఖ్యమంత్రి అయ్యేందుకు అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. కానీ ఆయన గురించి తమిళిసై అనవసరమైన వ్యాఖ్యలు చేస్తోందన్నారు. ఉదయనిధి చిన్న వయసు నుంచే డీఎంకే కోసం కష్టపడ్డారని, యువతకు మార్గదర్శకంగా ఉన్నారన్నారు. విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు నాన్ ముదలవన్, పుదుమై పెన్ మొదలైన పథకాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రవేశపెట్టారని తెలిపారు. విద్య, ఆరోగ్యం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

రైళ్ల దారి మళ్లింపు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నై బీచ్ యార్డులో జరుగుతున్న సాంకేతిక పనుల కారణంగా పలు రైళ్లు దారి మళ్లినట్టు దక్షిణ రైల్వే ఓ ప్రకటన విడుదల చేసింది. ● **11017** లోకమాన్య తిలక్ టెర్మినస్ - కారైక్కాల్ వీక్లీ 28న 13.15కు బయలుదేరే రైలు తిరుత్తణి, మేల్‌పాక్కం, చెంగల్పట్టు మీదుగా నడుస్తుంది. అరక్కోణం, పెరంబూరు, ఎగ్మూరు, తాంబరం మీదుగా రాదు. తిరుత్తణిలో కాసేపు ఆగుతుంది. ● **02121** మదురై - జబల్‌పూర్ 28న 23.35కు బయలుదేరే రైలు చెంగల్పట్టు, మేల్‌పాక్కం, అరక్కోణం, పెరంబూరు, కొరుక్కుపేట మీదుగా దారి మళ్లింది. తాంబరం, ఎగ్మూరులో ఆగదు. అదనంగా అరక్కోణంలో కాసేపు నిలుస్తుంది. ● **12651** మదురై - హజరత్ నిజాముద్దీన్ సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ 29న 00.55కు బయలుదేరే రైలు చెంగల్పట్టు, మేల్‌పాక్కం, అరక్కోణం, పెరంబూరు, కొరుక్కుపేట మార్గంగా నడుస్తుంది. పెరంబూరులో ప్రయాణికుల కోసం రెండు నిమిషాలు ఆగుతుంది. ● **09420** తిరుచ్చిరాపల్లి - అహ్మదాబాద్ 29న 05.40కి బయలుదేరే రైలు చెంగల్పట్టు, మేల్‌పాక్కం, తిరుత్తణి మీదుగా దారి మళ్లింది. తిరుత్తణిలో ప్రయాణికుల కోసం కాసేపు నిలుస్తుంది.

కోవై ఐటీ పార్కులో 3200 ఉద్యోగాలు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోయంబత్తూరులో కొత్తగా నిర్మించిన ఐటీ పార్కు ద్వారా 3200 మంది ఉద్యోగాలు పొందనున్నారని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి పళనివేల్ త్యాగరాజన్ వెల్లడించారు. ఆయన కోవై విళాంకుళంలో రూ.114.16 కోట్ల వ్యయంతో నిర్మించిన శాఖ భవనాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్, బెంగళూరు నగరాలకు దీటుగా చెన్నై, హోసూరులో హైటెక్ సిటీల నిర్మాణ పనులు శరవేగంగా జరుతున్నాయన్నారు. వాటి ద్వారా వందలాది మంది ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. జీఎస్టీ విధానంలో కేంద్ర ప్రభుత్వం మార్పులు తీసుకువస్తే మూతపడ్డ చిన్న తరహా పరిశ్రమలు పునఃప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. ఆ దిశగా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి చర్యలు చేపట్టాలని డిమాండు చేశారు.



మాట్లాడుతున్న మంత్రి పళనివేల్ త్యాగరాజన్

సాగులో ఆధునిక పద్ధతులు అవలంబించాలి



మాట్లాడుతున్న మంత్రి ఎంఆర్‌కే పన్నీరుసెల్వం

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు అవలంబిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి ఎంఆర్‌కే పన్నీరుసెల్వం పేర్కొన్నారు. కోయంబత్తూరులోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు దినోత్సవ వేడుకలు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. . అధిక దిగుబడులు ఇచ్చే సాగులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చెరువులకు పెరిగిన నీటిరాక

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: పూండి, పుళల్, చెంబరంబాక్కం, చోళవరం, కన్నన్‌కోట్టై చెరువుల్లో నిల్వ జేసే నీటితో చెన్నై నగర తాగునీటి అవసరాలు తీరుతున్నాయి. బుధవారం రాత్రి చెరువుల పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో చెరువులకు నీటిరాక అధికమైంది. చోళవరం చెరువుకు 697 క్యూసెక్‌లు, చెంబరంబాక్కానికి 350, పూండికి 50, కన్నన్‌కోట్టైకి 31, చోళవరానికి 20 క్యూసెక్‌ల వర్షపు నీరు చేరుకుంటోంది.

2న గొడుగుల యాత్ర ప్రారంభం

టీనగర్, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన గరుడసేవ రోజు స్వామివారికి సమర్పించేందుకు తమిళనాడు భక్తుల తరపున గొడుగులను తిరుమలకు ఊరేగింపుగా తీసుకెళ్లనున్నారు. నగరంలో ఫ్లవర్ బజారులోని చెన్నకేశవస్వామి ఆలయం వద్ద అక్టోబరు 2వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యాత్ర బయలుదేరనుంది. హిందూ ధర్మార్థ సమితి నిర్వాహక ట్రస్టీలు వేదాంతం, గోపాల్‌జీలు కార్యక్రమానికి సారథ్యం వహించనున్నారు. ఈ ఏడాది కూడా 11 గొడుగులతో యాత్ర సాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

శ్రీలంక జైలు నుంచి మత్స్యకారుడి విడుదల

ప్యారిస్, న్యూస్‌టుడే: శ్రీలంక జైలు నుంచి రామనాథపురం మత్స్యకారుడు విడుదలై సొంతూరికి వచ్చారు. జులై 23న రామేశ్వరం ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లిన సగాయ రాబర్ట్(49), మరో నలుగురు జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్టు చేసింది. రాబర్ట్ రెండోసారి సరిహద్దులు దాటాడని తెలిపి అతనికి 18 నెలల జైలు శిక్ష విధించి, మిగిలిన నలుగురిని శ్రీలంక కోర్టు విడుదల చేసింది. ఈ నేపథ్యంలో శ్రీలంకలో సెప్టెంబరు 12న జాతీయ ఖైదీల దినోత్సవం సందర్భంగా 359 మంది ఖైదీలను క్షమాభిక్షతో విడుదల చేసింది. సగాయరాబర్ట్ కూడా విడుదలయ్యారు. గురువారం సొంతూరికి చేరుకున్నారు.

ఈశాన్య రుతుపవనాలు ఎదుర్కోవడానికి సిద్ధం

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ఈశాన్య రుతుపవనాలను ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి రామచంద్రన్ తెలిపారు. గురువారం ఉదయం చెన్నై ఎళిళగంలోని రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ సెంటర్‌ను ఆయన పరిశీలించారు. చెన్నై నగరంలో కురిసిన వర్షపాత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇప్పటివరకు కురిసిన వర్షాల వలన ఎటువంటి నష్టం జరగలేదన్నారు. ఈశాన్య రుతపవనాల ప్రభావంతో కురిసే వర్షాలకు లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడానికి పునరావాస శిబిరాలను తెరచిఉంచారని, విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొనడానికి సన్నద్ధం కావాలని తెలిపారు. చెన్నై సహా 15 జిల్లాల్లో సగటున 0.83 సెం.మీ వర్షపాతం నమోదైందని వివరించారు.



రాష్ట్ర అత్యవసర ఆపరేషన్ సెంటర్‌లో పరిశీలిస్తున్న మంత్రి రామచంద్రన్

అరెస్టు వారెంట్ జారీచేయాల్సి ఉంటుంది

సభాపతికి ప్రత్యేక కోర్టు హెచ్చరిక

ప్యారిస్, న్యూస్‌టుడే: పరువునష్టం దావా కేసులో సభాపతి అప్పావు కోర్టులో విచారణకు హాజరుకాకుంటే అరెస్టు వారెంట్ జారీ చేయాల్సి వస్తుందని కోర్టు హెచ్చరించింది. సభాపతి అప్పావుపై అన్నాడీఎంకే న్యాయవాద విభాగం జాయింట్ కార్యదర్శి బాబు మురుగవేల్ పరువునష్టం దావా వేశారు. ఈ కేసు చెన్నై జిల్లా కలెక్టరు కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేల కేసులు విచారించే ప్రత్యేక కోర్టులో విచారణలో ఉంది. గతసారి కేసు విచారణకు వచ్చినప్పుడు.. అప్పావు హాజరై సమన్లు అందుకున్నారు. ఈ నేపథ్యంలో గురువారం మళ్లీ విచారణకు రాగా అప్పావు హాజరుకాలేదు. దీంతో న్యాయమూర్తి.. విచారణకు హాజరుకాకుండా ఉండటం చట్టరీత్యా నేరమని, తదుపరి విచారణకు కచ్చితంగా హాజరవ్వాలని, లేకుంటే అరెస్టు వారెంట్ జారీచేస్తామని హెచ్చరించారు. తదుపరి విచారణను అక్టోబరు 18కి వాయిదా వేశారు.

పుదుచ్చేరిలో అయిదుగురిపై సీబీఐ కేసు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పుదుచ్చేరి కాలుష్యనియంత్రణ, పర్యావరణశాఖలో సైంటిఫిక్ అధికారి పనిచేస్తున్న శ్రీనివాసరావ్ కాలుష్యనియంత్రణ ధ్రువీకరణపత్రం ఇచ్చేందుకు లంచం తీసుకుంటున్నట్లు సీబీఐ అధికారులకు ఫిర్యాదు అందింది. ఆ మేరకు ఆయనపై సీబీఐ నిఘా పెట్టింది. కొద్ది రోజుల ముందు పుదుచ్చేరి అన్నానగర్‌లోని కాలుష్యనియంత్రణ బోర్డు కార్యాలయంలో సీబీఐ పోలీసులు తనిఖీలు చేశారు. పుదుచ్చేరి లింగారెడ్డియాపాళ్యంలోని ప్రైవేట్ కంపెనీకి అనుమతి ఇచ్చి రూ.2 లక్షలు లంచం తీసుకున్నందుకు శ్రీనివాసరావ్‌పై కేసు నమోదు చేశారు. ప్రైవేట్ కంపెనీ డైరెక్టర్, కోవైకు చెందిన ఒకరు, పుదుచ్చేరి సారం ప్రాంతానికి చెందిన మరొకరు, ఇంకో వ్యక్తిపై కూడా కేసు నమోదైంది.

రిజిస్ట్రేషన్లశాఖ డీఐజీ అరెస్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: రిజిస్ట్రేషన్లశాఖ సేలం, మదురై విభాగ డీఐజీ రవీంద్రనాథ్ కోట్ల విలువచేసే ఐదు ఎకరాల భూమిని కాంతమ్మాళ్ అనే మహిళ పేరుపై నకిలీ పత్రాలతో మార్చినట్లు ఆరోపణలు వచ్చాయి. అంతేకాకుండా దక్షిణ చెన్నైలో విధులు నిర్వహించిన సమయంలో తాంబరం సమీప వరదరాజపురంలో సయ్యద్ అమీన్‌కి చెందిన భూమిని నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసినట్లు కేసు నమోదైంది. రిజిస్ట్రేషన్ అసిస్టెంట్, సబ్ రిజిస్ట్రార్‌ల వద్ద జరిపిన దర్యాప్తులో.. డీఐజీ రవీంద్రనాథ్ నకిలీ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు తెలియడంతో చెన్నై సీబీసీఐడీ పోలీసులు ఆయన్ను అరెస్టు చేశారు.

పురస్కారానికి అర్హమైన సినిమా నందన్


దర్శకుడు గోపీ నయినార్



చెన్నై, న్యూస్‌టుడే: వైవిధ్యమైన పాత్రలో శశికుమార్ నటించిన 'నందన్' చిత్రాన్ని అభినందిస్తూ దర్శకుడు గోపీ నయినార్ తన ఫేస్‌బుక్ పేజీలో ఓ పోస్టు ఉంచారు. అందులో... అణచివేతకు గురైన ప్రజల రాజకీయ అధికారాన్ని నిజాయతీగా సినిమా ద్వారా ప్రజల మధ్యకు 'నందన్' తీసుకెళ్లిందని తెలిపారు. ప్రజాస్వామ్యంపై అత్యంత శ్రద్ధ కలిగిన దర్శకుడు శరవణన్ ధైర్యాన్ని ఎంతైనా అభినందించవచ్చన్నారు. సామాజిక న్యాయంతో ముడిపడిన ఈ చిత్రానికి రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత ప్రత్యేక కళా పురస్కారాన్ని అందించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అణచివేతకు గురైనవారు పంచాయతీ పదవుల్లోకి వస్తే జరిగే పరిణామాలకు ఈ చిత్రం అద్దం పట్టిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పంచాయతీ అధ్యక్షులు, కౌన్సిలర్లు ఈ సినిమాను చూడాల్సిన సామాజిక ఆవశ్యకతను గ్రహించేలా రాష్ట్ర ప్రభుత్వం ఓ సూచన అందించాలని, యువతరం, విద్యార్థులకూ ఈ చిత్రాన్ని చూపించడానికి మార్గాన్ని సుగమం చేయాలని కోరారు.

సుదీర్ఘ విరామం తర్వాత ఆర్యన్ చిత్రీకరణ


చెన్నై: వర్ధమాన దర్శకుడు ప్రవీణ్ దర్శకత్వంలో విష్ణు విశాల్, శ్రద్ధ శ్రీనాథ్, వాణీ భోజన్, సెల్వరాఘవన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్న చిత్రం 'ఆర్యన్'. 2022లో చిత్రీకరణ పనులు ప్రారంభం



కాగా తనకు సంబంధించిన పలు సన్నివేశాల్లో విష్ణు విశాల్ నటించారు. తర్వాత అనివార్య కారణాలతో చిత్రీకరణ పనులు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో చిత్రీకరణ మళ్లీ మొదలైనట్టు విష్ణు విశాల్ తన 'ఎక్స్' పేజీ ద్వారా వెల్లడించారు. ఈ చిత్రాన్ని విష్ణువిశాల్ స్టూడియోస్ నిర్మిస్తుంది.

మరికొన్ని సినీ విశేషాలు

- ప్రముఖ నేపథ్యగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నివాసం ఉన్న నుంగంబాక్కంలోని కాందార్ నగర్ మెయిన్ రోడ్డుకు 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం రోడ్డు'గా పేరు పెట్టనున్నట్టు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయనకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కుమారుడు ఎస్పీ చరణ్ సామాజిక మాధ్యమాల వేదికగా తన కుటుంబం తరఫున కృతజ్ఞతలు తెలిపారు.
- గత శుక్రవారం 'కడైసి ఉలగ పోర్', 'లబ్బర్ పందు', 'నందన్', 'ధోనిమా', 'తోళర్ సేగువారా', 'కోళిపణ్ణై చెల్లదురై' చిత్రాలు విడుదలయ్యాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం అరవింద్ సామి, కార్తి ప్రధాన పాత్రల్లో నటించిన 'మెయ్యళగన్', సతీష్ ప్రధాన పాత్రలో నటించిన 'చట్టం ఎన్ కైయిల్', విజయ్ ఆంటోని హీరోగా నటించిన 'హిట్లర్', ప్రభుదేవా, వేదిక జంటగా నటించిన 'పేట్టరాప్', విజయ్ సత్య, షెరిన్ జంటగా నటించిన 'దిల్ రాజా' తదితర చిత్రాలు విడుదల కానున్నాయి.



కృతజ్ఞతలు చెబుతున్న ఎస్పీ చరణ్



బ్లాక్ విడుదలకు సన్నాహాలు

చెన్నై: పొటెన్షియల్ స్టూడియోస్ పతాకంపై బాలసుబ్రమణి దర్శకత్వం వహించిన చిత్రం 'బ్లాక్'. జీవా, ప్రియా భవాని శంకర్ జంటగా నటించిన ఈ చిత్రం ఒకే రోజు రాత్రి జరిగే ఘటన చుట్టూ కథ తిరుగుతుంది. చెన్నైలో చేపట్టిన చిత్రీకరణ పనులు ముగిసి చిత్రం విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయి. ట్రైలర్‌ను చిత్ర బృందం విడుదల చేసింది. హారర్ జోనర్‌లో రూపొందిన ఈ చిత్రం అభిమానులను తప్పకుండా ఆకట్టుకుంటుందని చిత్రబృందం ఆశాభావం వ్యక్తం చేసింది.

బరువు తగ్గడానికే పవన్ కల్యాణ్ దీక్ష

నామ్ తమిళర్ కట్చి సీమాన్

చెన్నై, న్యూస్‌టుడే: శరీర బరువు తగ్గడానికే ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దీక్ష చేపట్టారని నామ్ తమిళర్ కట్చి చీఫ్ కన్వీనర్, తమిళ దర్శక నటుడు సీమాన్ ఎద్దేవా చేశారు. చెన్నైలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. తిరుపతి లడ్డూ వ్యవహారంలో గుత్తేదారుపై చర్యలు చేపట్టి మరొకరికి కాంట్రాక్టు అప్పగిస్తే సమస్య పరిష్కారమవుతుందన్నారు. అందుకు బదులు దానిని దేశవ్యాప్తంగా వివాదాస్పదం చేశారని తెలిపారు. హిందువులు గోవు నుంచి వచ్చే పాలు, నెయ్యి తినేటప్పుడు గోవు కొవ్వు తింటే చచ్చిపోతారా అని, గోమూత్రం తాగేటప్పుడు గోవు కొవ్వు తినరా అని ప్రశ్నించారు. కులం, మతంతో రాజకీయాలు చేసేవారు ప్రజలు గురించి ఆలోచించరన్నారు. జనం గురించి ఆలోచించే కులం, మతంపై ఆలోచించే సమయం ఉండదని చెప్పారు. 'సత్యం సుందరం' ప్రమోషన్ షోలో లడ్డూ గురించి ఎదురైన ప్రశ్నను నటుడు కార్తి సున్నితంగా తోసిపుచ్చారు. ఆయన వ్యాఖ్యలపై ఎలాంటి వివాదం లేదని పేర్కొన్నారు. అయినా పవన్ కల్యాణ్ కోపగించుకోవడం అర్థరహితమని తెలిపారు.

తిరువళ్లూరులో రైతు సమావేశం నేడు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం రైతు సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రభుశంకర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు జరగనున్న సమావేశంలో జిల్లాలోని రైతులు పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

అక్టోబరు 2న గ్రామసభలు

కాంచీపురం, న్యూస్‌టుడే: గాంధీ జయంతిని పురస్కరించుకొని కాంచీపురం జిల్లాలో అక్టోబర్ 2న అన్ని పంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహించాలని కలెక్టరు కలైసెల్వి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 272 పంచాయతీల్లో అక్టోబర్ 2న ఉదయం 11 గంటలకు తప్పనిసరిగా సభలను నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజలు సభల్లో పాల్గొని సమస్యలు పరిష్కరించుకోవాలని తెలిపారు.



అంతర్జాతీయ సంజ్ఞ భాష వారోత్సవాలను పురస్కరించుకొని కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూర్ తాలూకా పిళ్లైపాక్కంలోని స్పార్క్ మిండా కార్పొరేషన్, జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖ సంయుక్తంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టరు కలైసెల్వి ఆ కంపెనీలో సుమారు 7 ఏళ్లుగా పనిచేస్తున్న అంధులను ప్రశంసించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్పార్క్ మిండా కార్పొరేషన్ ప్రధాన అధికారి సోమసుందరం తదితరులు పాల్గొన్నారు. **- శ్రీపెరుంబుదూర్, న్యూస్‌టుడే**

ఎంకేఆర్‌టీ సేవలు హర్షణీయం

టీనగర్, న్యూస్‌టుడే: మద్రాస్ నైట్స్ రౌండ్ టేబుల్ 181 (ఎంకేఆర్‌టీ), మద్రాస్ బార్ అసోసియేషన్, బిల్‌రోత్ వైద్యశాల సంయుక్త ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ సభ్యులకు మాస్టర్ హెల్త్ చెకప్ వైద్య శిబిరం గురువారం నిర్వహించారు. మద్రాసు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కృష్ణకుమార్ ప్రత్యేక హెల్త్ కార్డ్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. న్యాయమూర్తి దండపాణి, మద్రాస్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు భాస్కర్, కార్యదర్శి వీర వేంగడం, కోశాధికారి షణ్ముగం, రౌండ్ టేబుల్ ఏరియా-2 ఛైర్మన్ కునాల్ చౌదరి, మద్రాస్ నైట్స్ రౌండ్ టేబుల్ 181 ఛైర్మన్ సాయిచందన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. రౌండ్ టేబుల్ ఇండియాతో కలిసి మద్రాస్ నైట్స్ రౌండ్ టేబుల్ 181 చేస్తున్న సేవలు హర్షణీయమన్నారు.



కార్యక్రమంలో న్యాయమూర్తులు, నిర్వాహకులు

రాష్ట్ర జాలర్లను విడిపించాలని కేంద్రానికి లేఖ

చెన్నై, న్యూస్‌టుడే: బహ్రెయిన్ తీరరక్షణ దళం అరెస్టు చేసిన రాష్ట్రానికి చెందిన 28 మంది జాలర్లను త్వరగా విడిపించడానికి చర్యలు చేపట్టాలని కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ కోరారు. ఆయన గురువారం రాసిన లేఖలో... తిరునెల్వేలి జిల్లా ఇడిందకరై గ్రామానికి చెందిన 28 మంది జాలర్లు చేపలు పట్టే వృత్తి కోసం ఇరాన్ దేశానికి వెళ్లిన నేపథ్యంలో అక్కడ సముద్రంలో సరిహద్దులు దాటినట్టు బహ్రెయిన్ తీరరక్షణ దళం 11న అరెస్టు చేసిందన్నారు. వారిని త్వరగా విడిపించడానికి అవసరమైన చట్ట, దౌత్యపరమైన సహాయాలను వెంటనే అందించాలని కోరారు.

సెంథిల్ బాలాజీకి బెయిల్ రావడం సంతోషకరం



మంత్రి ముత్తుసామి

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: మాజీ మంత్రి సెంథిల్ బాలాజీకి బెయిల్ మంజూరవ్వడం ఆహ్వానించదగ్గ అంశమని మంత్రి ముత్తుసామి పేర్కొన్నారు. ఆయన కోవైలో గురువారం విలేకరులతో మాట్లాడారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రజాస్వామ్యానికి లభించిన విజయంగా అభివర్ణించారు. సెంథిల్ బాలాజీకి మళ్లీ మంత్రి పదవి దక్కే అవకాశం ఉందా అని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. అది ముఖ్యమంత్రి స్టాలిన్ నిర్ణయమన్నారు. సీఎం దిల్లీ పర్యటన విజయవంతమవుతుందని, కేంద్రం నుంచి నిధులు అందే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు.



పనులు పరిశీలిస్తున్న మంత్రులు ఏవీ వేలు, టీఎం అన్బరసన్

డీఎంకే వజ్రోత్సవాల వేడుకకు ఏర్పాట్లు

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం సమీపంలోని పచ్చయప్పన్ బాలుర కళాశాల ప్రాంగణంలో ఈనెల 28వ తేదీ డీఎంకే వజ్రోత్సవాల వేడుక నిర్వహించనున్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి, మంత్రి దురై మురుగన్ నేతృత్వంలో జరుగుతున్న ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్, డీఎంకే కూటమి పార్టీల నాయకులు పాల్గొని ప్రసంగిస్తారు. ఈ క్రమంలో కార్యక్రమ ఏర్పాట్లను మంత్రులు ఏవీ వేలు, టీఎం అన్బరసన్ బుధవారం సాయంత్రం పరిశీలించారు.



ముస్తాబవుతున్న సభా ప్రాంగణం

రేషన్ దుకాణాల్లో కొలతల సమస్యకు పరిష్కారం

బయోమెట్రిక్ పరికరానికి ఎలక్ట్రానిక్ త్రాసు అనుసంధానం

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రేషన్ సరకుల్లో బరువు తక్కువ ఫిర్యాదులను పరిష్కరించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బయోమెట్రిక్ పరికరానికి ఎలక్ట్రానిక్ త్రాసు అనుసంధానించి సరైన బరువుతో సరకులు బరువు తూచే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. దీని గురించి ప్రజా పంపిణీ అధికారులు మాట్లాడుతూ.. రేషన్ సరకులను ప్యాక్ చేసి సరఫరా చేయడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నట్టు చెప్పారు. దుకాణాలలో బయోమెట్రిక్ పరికరాన్ని వైఫై ద్వారా బరువు కొలిచే ఎలక్ట్రానిక్ త్రాసుకు అనుసంధానించే చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. మొదటి విడతగా 60 కిలోల వరకు బరువులు తూచే ఎలక్ట్రానిక్ త్రాసులున్న దుకాణాల జాబితా సేకరిస్తున్నట్టు తెలిపారు. మలి విడతగా అన్ని దుకాణాలకు ఈ విధానం విస్తరించడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సిబ్బంది అవకతవకలు నివారించడానికి దుకాణాలలో బయోమెట్రిక్ పరికరాన్ని ప్రవేశపెట్టారు. అయితే కొన్నికొన్నిసార్లు సర్వర్ సమస్య కారణంగా వేలిముద్ర నమోదు కావట్లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. దీంతో ఐరిస్ సరిచూసి నిర్ధారించి సరకులు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆ మేరకు ప్రతి జిల్లాలో సూచించిన రేషన్ దుకాణాలలో ప్రయోగాత్మకంగా ఐరిస్ సరిచూసి వస్తువులు అందజేస్తున్నారు.



ఓ దుకాణంలో ఐరిస్ నమోదు చేస్తున్న దృశ్యం

లడ్డూ వ్యవహారాన్ని వ్యంగ్యంగా చిత్రీకరించటం తగదు

పొంగులేటి సుధాకర్‌రెడ్డి

సైదాపేట, న్యూస్‌టుడే: లడ్డూ వ్యవహారాన్ని వ్యంగ్యంగా చిత్రీకరిస్తున్న యూట్యూబ్ ఛానళ్లపై చర్యలు తీసుకోవాలని భాజపా తమిళనాడు, కర్ణాటక జాతీయ సహాయ ఇన్‌ఛార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించి ఆయన మాట్లాడుతూ..'పరితాపంగల్' గోపి, సుధాకర్ లడ్డూ వ్యవహారాన్ని హాస్యంగా క్రియేట్ చేయటం సరికాదన్నారు. ఆంధ్రప్రదేశ్ పోలీసు శాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పవన్‌కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్షపై నామ్ తమిళర్ కన్వీనర్ సీమాన్ అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఆ వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు లడ్డూ వ్యవహారాన్ని స్వార్థం కోసం వాడుకోకూడదని తెలిపారు.

యూట్యూబ్ ఛానల్‌పై భాజపా ఫిర్యాదు

సైదాపేట: తిరుపతి లడ్డూ వ్యవహారంగా వీడియో విడుదల చేసిన పరితాపంగళ్ యూట్యూబ్ ఛానల్‌పై ఆంధ్రప్రదేశ్ డీజీపీ వద్ద ఫిర్యాదు చేసినట్లు తమిళనాడు భాజపా క్రీడా విభాగ అధ్యక్షుడు అమర్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. వారు ఛానల్ నుంచి వీడియో తొలగించినా అది హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా ఉందని పేర్కొన్నారు. అల్లర్లు సృష్టించేలా ఉందని చెప్పారు.

సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో పుళల్ జైలు నుంచి బయటికొచ్చిన మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ





జైలు వెలుపల బాణాసంచా కాల్చుతున్న డీఎంకే శ్రేణులు

తిరుక్కురల్ చెబితే జ్యూస్ ఉచితం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తంజావూర్ నాంజికోట్టై రోడ్డులో శ్రీనివాసన్ అనే యువకుడు సోదరుడు శివాజీతో కలిసి జ్యూస్ దుకాణం నడుపుతున్నాడు. ఇక్కడ పాఠశాలలు ఉండటంతో విద్యార్థులు ఎక్కువగా వస్తుంటారు. వారిలో తమిళంపై ఆసక్తి రేకెత్తించేలా తిరుక్కురల్ చదివే అలవాటు ప్రోత్సహించేందుకు సరికొత్త పథకం ప్రకటించారు. 5 తిరుక్కురల్ పద్యాలు చెబితే జ్యూస్, 10 చెబితే పాల షర్బత్, 20 చెబితే మిల్క్ షేక్ ఉచితంగా అందిస్తున్నారు. శ్రీనివాసన్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాల ముగిసిన తర్వాత ఇంటికెళ్లి సెల్‌ఫోన్ చూడడం అలవాటైపోయిందన్నారు. దానిని మార్చేలా తిరుక్కురల్ పద్యాలు కంఠస్థం చేసుకొచ్చి చెబితే జ్యూస్ ఇస్తానని ప్రకటించానన్నారు. ఇది మంచి ఫలితం ఇస్తోందన్నారు. రోజూ సుమారు 75 మందికిపైగా చదివి వచ్చి జ్యూస్ తాగి వెళ్తున్నారని చెప్పారు. ఇది ఆత్మసంతృప్తి ఇస్తోందన్నారు.



జ్యూస్ తాగుతున్న విద్యార్థులు, దుకాణ యజమాని శ్రీనివాసన్

ఏనుగు దాడిలో రైతు మృతి

విల్లివాక్కం: నీలగిరి జిల్లా పందలూర్ చేరంబేడి సమీప చప్పందోడు గ్రామానికి చెందిన మహమ్మద్ (55) తన ఇంటి వెనుక వక్క తోట సాగుచేశారు. గురువారం వేకువజామున అడవి నుంచి వచ్చిన రెండు ఏనుగులు మహమ్మద్ తోటలో చొరబడి ధ్వంసం చేశాయి. మహమ్మద్ నిద్రలేచి ఏనుగులను చూసి ఇంట్లోకి వెళ్లేలోగా ఓ ఏనుగు దాడిచేసింది. తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న అటవీశాఖ సిబ్బంది, పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలిస్తుండగా కుటుంబీకులు, బంధువులు అడ్డుకున్నారు. ఏనుగుల దాడులకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆందోళనకు దిగారు. వారితో పోలీసులు, అటవీశాఖ వారు చర్చలు జరపడంతో శాంతించారు.

రోడ్డు ప్రమాదంలో తపాలా ఉద్యోగి...



శివన్ (పాతచిత్రం)

ఊత్తుకోట: ఊత్తుకోట సమీప గూనిపాళ్యానికి చెందిన శివన్ (52) చెన్నై మైలాపూర్‌లోని తపాలా శాఖ కార్యాలయంలో పని చేస్తున్నాడు. ఇతను గూనిపాళ్యం నుంచి దాసుకుప్పానికి బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. పెరింజేరి వద్ద అదుపుతప్పిన వాహనం రోడ్డు పక్కన పొలంలో బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన శివన్‌ను స్థానికులు ఊత్తుకోట ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో బాలుడు...

రెడ్‌హిల్స్: చోళవరం సమీప కారనోడైకి చెందిన సెంథిల్‌కుమార్ పాత ఇనుము దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతని కుమారుడు నకుల్ (12) ప్రైవేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. బుధవారం రాత్రి సెంథిల్‌కుమార్ దుకాణం శుభ్రం చేశాడు. ఆ సమయంలో పైన వేలాడుతున్న విద్యుత్తు తీగకు ఇనుప కమ్మీ తగలడంతో విద్యుదాఘాతానికి గురై నకుల్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు.

భార్య అవస్థ చూడలేక గొంతుకోసి చంపిన భర్త

జీవించలేక తానూ ఆత్మహత్యాయత్నం

ప్యారిస్, న్యూస్‌టుడే: వృద్ధాప్యంతో మంచానపడిన భార్యను చంపిన భర్త ఆత్మహత్యకు యత్నించిన ఘటన కన్నియాకుమరిలో చోటుచేసుకుంది. కన్నియాకుమరి ఆసారివిళై కలైజ్ఞర్ కాలనీకి చెందిన చంద్రబోస్ (83), లక్ష్మి (75) భార్యాభర్తలు. వీరికి ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. అందరికీ వివాహాలై వేర్వేరుగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో లక్ష్మి వృద్ధాప్యంతో మంచానికే పరిమితమైంది. ఆమెకు మందులు ఇస్తున్నా కోలుకోలేదు. గత కొన్ని రోజులుగా ఆమె తీవ్రంగా ఇబ్బంది పడుతుండటాన్ని చూడలేక చంద్రబోస్ కత్తితో ఆమె గొంతుకోసి చంపేశాడు. అనంతరం తానూ ఆత్మహత్యకు యత్నించాడు. గురువారం ఉదయం వారి ఇంటికి వచ్చిన పెద్ద కుమారుడు ఆనంద్.. తల్లి మృతిచెంది ఉండటం, తండ్రి ప్రాణాలతో పోరాడుతుండటాన్ని చూసి దిగ్భ్రాంతి చెందాడు. సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న పోలీసులు చంద్రబోస్‌ని ఆస్పత్రికి తరలించారు.

రౌడీషీటర్ దారుణహత్య

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: తంజావూర్ జిల్లా కరందై మిలగుశెట్టి ప్రాంతానికి చెందిన అరివళగన్ (40) చేపల వ్యాపారి. ఇతనిపై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదిలా ఉండగా బుధవారం రాత్రి స్నేహితులు అరివళగన్‌ను మద్యం తాగేందుకు తీసుకెళ్లారు. మారియమ్మన్ ఆలయ సమీపంలో మద్యం తాగుతుండగా అక్కడికి వచ్చిన దుండగులు అరివళగన్‌పై కత్తులతో దాడిచేసి హతమార్చారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఐటీ ఉద్యోగి బలవన్మరణం



జీవనాథన్ (పాతచిత్రం)

ఊత్తుకోట, న్యూస్‌టుడే: ఊత్తుకోట సమీప దొంబరంబేడు కావాంకరైకి చెందిన జీవనాథన్ (29) చెన్నైలోని ఓ ఐటీ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇతను చాలా ఏళ్లుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందినా నయంకాలేదు. ఈ నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందిన అతను బుధవారం రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇద్దరు పిల్లలను చంపి తండ్రి ఆత్మహత్యాయత్నం

ప్యారిస్, న్యూస్‌టుడే: ఇద్దరు పిల్లలను హత్య చేసి తండ్రి ఆత్మహత్యకు యత్నించిన ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల వివరాల మేరకు... మదురై అన్నానగర్‌కి చెందిన సేతుపతి, రాజేశ్వరి భార్యాభర్తలు. వీరికి రక్షణ (7), రక్షిత (5) అనే ఇద్దరు కుమార్తెలున్నారు. ఈ క్రమంలో కుటుంబ గొడవల కారణంగా గురువారం సేతుపతి.. తన ఇద్దరు పిల్లలను కత్తితో పొడిచి హత్య చేసి, తానూ ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను, కొన ఊపిరితో ఉన్న సేతుపతిని ఆస్పత్రికి తరలించారు. ఘటనపై భార్య రాజేశ్వరి వద్ద పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

11 కిలోల గంజాయి స్వాధీనం

గుమ్మిడిపూండి, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతి జిల్లా తడ, సూళ్లూరుపేట, నెల్లూరు తదితర ప్రాంతాల నుంచి గుమ్మిడిపూండి మీదుగా చెన్నైకి గంజాయి తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆ మేరకు ఆరంబాక్కం పోలీసులు ఎళావూరు వద్ద గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో నెల్లూరు నుంచి చెన్నై మాధవరానికి వెళ్తున్న ప్రైవేటు బస్సులో సోదా చేసి 11 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి హోసూరుకు చెందిన అరుణ్‌మాథ్యూని అరెస్టు చేశారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకున్న విశ్రాంత డీజీపీ భార్య

ప్యారిస్, న్యూస్‌టుడే: విశ్రాంత డీజీపీ శ్రీపాల్ భార్య కమలి చెన్నై టీనగర్‌లో నివాసం ఉంటున్నారు. శ్రీపాల్ ఇదివరకే చనిపోయారు. ఈ క్రమంలో కమలికి టెలికామ్ రెగ్యులేటరీ ఆథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) అధికారి పేరుతో ఓ వ్యక్తి రెండు రోజుల క్రితం ఫోన్ చేశాడు. తన సెల్‌ఫోన్ నెంబరు చట్ట వ్యతిరేక పనులకు ఉపయోగించారని, ముంబయి సీబీఐ అధికారులకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం ముంబయి నుంచి సీబీఐ అధికారి పేరుతో ఓ వ్యక్తి ఫోన్ చేసి.. సైబర్ నేరస్థులు మీ బ్యాంకు ఖాతాను ఉపయోగించారని, వెంటనే తాను చెప్పే నెంబరుకి జీ పే ద్వారా నగదు పంపాలని, దానిని రిజర్వ్ బ్యాంకు సాయంతో సరిచూసి, మళ్లీ మీ ఖాతాలో వేస్తారని, లేకుంటే అరెస్టు అవుతారని బెదిరించారు. దీంతో ఆమె వారు చెప్పినట్లుగానే రూ.90 వేల నగదు పంపింది. తిరిగి నగదు తన ఖాతాకు రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సులో నగదు చోరీ

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరుత్తణి సమీప చిన్నకడంబూరుకు చెందిన చిత్ర స్వయం సహాయ సంఘ సభ్యురాలు. ఈమె బుధవారం సాయంత్రం తిరుత్తణి మాపోసీ రోడ్డులోని ఓ బ్యాంకులో రూ.40 వేలు తీసుకొని బస్టాండుకు వచ్చింది. రద్దీగా ఉన్న బస్సులో ఎక్కి టికెట్టు తీసుకునేందుకు సంచిలో చూడగా నగదు కనిపించలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోర్టుకు వెళ్లిన రౌడీషీటర్ అరెస్ట్



జాన్

సేలం, న్యూస్‌టుడే: సేలం జిల్లా కిచ్చంబాళ్యం ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ జాన్ పలు కేసుల్లో అరెస్టయ్యి ఇటీవల బెయిల్‌పై విడుదలయ్యాడు. ఇతను గురువారం అస్తంబట్టి కోర్టులో విచారణకు హాజరయ్యేందుకు న్యాయవాదియైన తన భార్య శరణ్యతో వెళ్లాడు. అక్కడే పొంచి ఉన్న పోలీసులు జాన్‌ను అరెస్టు చేశారు. దీని గురించి అతని భార్య శరణ్య మాట్లాడుతూ.. తన భర్తను ఎందుకు అరెస్టు చేశారో తెలియలేదని, ఆయన ప్రాణానికి ముప్పు ఏర్పడితే పోలీసులే బాధ్యులన్నారు.

పోక్సో చట్టం కింద పూజారి...

ప్యారిస్: తేని భగవతి అమ్మన్ ఆలయంలో 70 ఏళ్ల వ్యక్తి పూజారిగా పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం ఆయన ఆలయం ముందు ఆటలాడుతున్న ఇద్దరు బాలురు, బాలికలను స్వీటు ఇస్తానని లోనికి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు గురిచేశాడు. విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు తెలపడంతో బంధువులతో కలిసి ఆలయం వద్దకు చేరుకున్నారు. పూజారి వెంటనే ఆలయానికి లోపలి నుంచి తాళం వేసుకుని ఉండిపోయాడు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పూజారిని బయటికి రప్పించారు. పోక్సో చట్టం కింద అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

లంచం తీసుకున్న రెవెన్యూ అధికారి...



షేక్ మహ్మద్

పొన్నేరి: పొన్నేరి సమీప పెరుంగావూరుకు చెందిన రామదాస్ విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి. ఇతనికి పీఎఫ్, ఇతర నగదు ప్రయోజనాలు అందలేదు. దీంతో అతను పొన్నేరి తాలూకా కార్యాలయంలోని అధికారి షేక్ మహ్మద్‌ను సంప్రదించారు. రూ.3 వేలు ఇస్తే దస్త్రాలపై సంతకం చేస్తానని అతను తేల్చి చెప్పాడు. దీంతో రామదాస్ తిరువళ్లూరులోని అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారి సూచనల మేరకు రసాయనం పూసిన నోట్లను మహ్మద్‌కు అందజేస్తుండగా అనిశా అధికారులు అరెస్టు చేశారు.

ఘర్షణకు పాల్పడ్డ నలుగురు...

వేలూర్: వేలూర్ చిన్న అల్లాపురానికి చెందిన జాకీర్, జహీర్‌కు పనతోప్పుకు చెందిన ఇంతియాజ్, జాఫర్‌తో పాతకక్షలు ఉన్నాయి. గురువారం ఇరువర్గాలు మారణాయుధాలతో ఘర్షణకు దిగాయి. తీవ్రంగా గాయపడ్డ వారిని స్థానికులు కోవై ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు.

బాణసంచా గోదాములో అగ్నిప్రమాదం

ప్యారిస్, న్యూస్‌టుడే: పేలుడు కారణంగా రూ.లక్షల విలువైన బాణసంచా కాలిపోయింది. శివకాశి-సాత్తూర్‌సాలైలో మేట్టూర్ ట్రాన్స్‌పోర్ట్ ఉంది. అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు వస్తువులు తీసుకెళ్తుంటారు. దీపావళి నేపథ్యంలో పెద్ద మొత్తంలో బాణసంచాను ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు తరలిస్తున్నారు. బుధవారం సాయంత్రం బాణసంచా ఉంచిన గోదాములో అకస్మాత్తుగా పేలుడు జరిగింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలు అదుపుచేశారు. రూ.లక్షల విలువైన బాణసంచా కాలిపోయింది. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఏవీ వేలు

ప్రజాపనులశాఖ పనులపై సమీక్ష

సైదాపేట, న్యూస్‌టుడే: ప్రజాపనుల శాఖ తరఫున తిరుచ్చి మండలంలో జరుగుతున్న పనులపై సమీక్ష గురువారం జరిగింది. చెన్నై చేపాక్కంలోని శాఖ సమావేశ హాలులో మంత్రి ఏవీ వేలు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. పర్యవేక్షక ఇంజినీర్లు ఆస్పత్రులు తదితర ఇతర ముఖ్య భవనాలను తరచుగా పరిశీలించి వివరాలు నమోదు చేయాలని సూచించారు. శాఖ అదనపు కార్యదర్శి మంగత్ రామ్‌శర్మ, ప్రధాన ఇంజినీరు సత్యమూర్తి, పలువురు అధికారులు పాల్గొన్నారు.